RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

వరంగల్ | ఆదివారం | పేజీలు : 6 | దినపత్రిక
సంపుటి : 4, సంచిక : 31 | జనవరి 04, 2026 | వెల : రూ.3-00



4లో.. కాల్వల మెయింటెనెన్స్‌పై తీవ్ర నిర్లక్ష్యం



- ☐ సుక్మా-బీజాపూర్ ఎన్‌కౌంటర్లలో 14 మంది నక్సలైట్లు హతం
- ☐ మృతుల్లో కీలక నేత 'మంగ్డూ' ఉన్నట్లు ధృవీకరించిన సుక్మా ఎస్పీ
- ☐ సాయుధ దళం మొత్తం కాల్పుల్లో తుడిచిపెట్టుకుపోయిందని వ్యాఖ్య
- ☐ బీజాపూర్లో జరిగిన ఎన్ కౌంటర్లో మరో ఇద్దరు మృతి
- ☐ మావోయిస్టు నెట్‌వర్క్‌కు కోలుకోలేని దెబ్బ

# మావోయిస్టు కోటకు బీటలు!

**వేద న్యూస్, క్రైం బ్యూరో:**

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులపై భద్రతా దళాలు నిర్ణయాత్మక దశకు చేరుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 2026 మార్చి గడువు సమీపిస్తున్న నేపథ్యంలో, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆపరేషన్లు మరింత ఉధృతమయ్యాయి. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున ఛత్తీస్‌గఢ్ లోని సుక్మా, బీజాపూర్ జిల్లాల్లో జరిగిన రెండు వేర్వేరు ఎదురు కాల్పుల్లో మొత్తం 14 మంది మావోయిస్టులు హతమయ్యారు. 2026లో భద్రతా దళాలకు, మావోయిస్టుల కు మధ్య జరిగిన తొలి పెద్ద ఎన్‌కౌంటర్ ఇదే కావడం విశేషం.సుక్మాలో

**క్లీన్ స్వీప్.. అగ్రనేత మృతి!**

శనివారం తెల్లవారుజామున సుక్మా జిల్లా దక్షిణ అడవుల్లో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఆపరేషన్ సమయంలో మావోయిస్టులతో భీకర ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో మావోయిస్టు పార్టీకి కీలకంగా భావించే కొంటా ఏరియా కమిటీ కార్యదర్శి 'మంగ్డూ' ఉన్నట్లు సుక్మా ఎస్పీ ధృవీకరించారు. అంతేకాదు, కొంటా ఏరియా కమిటీలోని సాయుధ దళం దాదాపుగా మొత్తం ఈ కాల్పుల్లోనే తుడిచి పెట్టుకుపోయిందని అధికారులు వెల్లడించారు. ఇది ఆ ప్రాంతంలోని మావోయిస్టు నెట్‌వర్క్‌కు కోలుకోలేని వ్యూహాత్మక దెబ్బగా భద్రతా వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**బీజాపూర్‌లో కొనసాగిన వేట**


మరోవైపు బీజాపూర్ జిల్లాలో ఉదయం 5 గంటల ప్రాంతంలో మరో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఇక్కడ జరిగిన కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు హతమయ్యారు. రెండు ఘటనలలో కలిపి మొత్తం 14 మంది మృతదేహాలను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. సంఘటనా స్థలాల నుంచి ఆటోమేటిక్ ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, పేలుడు పదార్థాలు భారీగా లభ్యమయ్యాయి.

**2026 గడువు.. భద్రతా దళాల ఉక్కుపాదం**

అమిత్ షా నిర్దేశించిన ప్రకారం 2026 మార్చి నాటికి దేశం నుంచి మావోయిజాన్ని పూర్తిగా నిర్మూలించాలి అన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర భద్రతా దళాలు సమన్వయంతో ముందుకెళ్తున్నాయి. ఈ లక్ష్యానికి అనుగుణంగా బస్తర్ డివిజన్ మొత్తం మావోయిస్టులపై ఒత్తిడి పెరుగుతోంది. గణాంకాల ప్రకారం, 2024 నుంచి ఇప్పటి వరకు కేవలం ఛత్తీస్‌గఢ్‌లోనే 500 మందికి పైగా మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో మృతి చెందారు. ఇది భద్రతా దళాల పట్టును, గూఢచర్య వ్యవస్థ బలాన్ని స్పష్టంగా చూపిస్తోంది. తాజా సుక్మా-బీజాపూర్ ఆపరేషన్లతో మావోయిస్టు వర్గాల్లో కలకలం రేగగా, రానున్న రోజుల్లో మరిన్ని తీవ్ర చర్యలు తప్పవని సంకేతాలు కనిపిస్తున్నాయి.

# పీఎల్‌జీఏ బెటాలియన్ పూర్తిగా క్షీణించింది

- 400 మందికి పైగా ఉన్న బలగం.. ప్రస్తుతం 66కే పరిమితం
- నాయకత్వం జనజీవన స్రవంతిలోకి వచ్చింది
- మిగిలినవారు లొంగిపోతే సహకారం అందిస్తాం తెలంగాణ డీజీపీ జితేందర్



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

మావోయిస్టు పార్టీకి చెందిన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) బెటాలియన్ పూర్తిగా క్షీణించిందని తెలంగాణ డీజీపీ డాక్టర్ జితేందర్ వెల్లడించారు. గతంలో ఈ బెటాలియన్‌లో 400 మందికి పైగా సభ్యులు ఉండగా, ప్రస్తుతం కేవలం 66 మంది మాత్రమే మిగిలి ఉన్నారని తెలిపారు. పీఎల్‌జీఏ బెటాలియన్‌కు చెందిన ముఖ్య నాయకత్వం ఇప్పటికే జనజీవన స్రవంతిలోకి వచ్చిందని డీజీపీ పేర్కొన్నారు. మావోయిస్టు ఉద్యమం ప్రజల మద్దతు కోల్పోయిందని, హింస మార్గం వదిలి ప్రధాన సమాజంలోకి రావడమే మిగిలిన వారికి ఉత్తమ మార్గమని సూచించారు. ప్రస్తుతం మిగిలి ఉన్న సభ్యులు తమ భవిష్యత్తు గురించి ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. లొంగి పోవాలనుకునే మావోయిస్టులకు ప్రభుత్వం,

మిగతా 3వ పేజీలో..

# రాష్ట్ర అభివృద్ధే లక్ష్యం

- ప్రజా సంక్షేమమే ప్రాధాన్యం
- అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకుని పథకాలు అమలు
- ప్రజల సహకారంతో రాష్ట్రాన్ని ముందంజలో నిలపగలం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**



రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పాలనలో పారదర్శకత, బాధ్యతాయుత నిర్ణయాలతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే తమ ధ్యేయమన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు అన్ని వర్గాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ గ్రామీణాభివృద్ధితో పాటు పట్టణాల్లో మౌలిక వసతుల బలోపేతానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసిన సీఎం, ఆర్థిక పరిస్థితిని సమర్థంగా నిర్వహిస్తూ సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అన్నారు. శాంతిభద్రతలు, సామాజిక సమానత్వం, సమగ్ర అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో తెలంగాణను అన్ని రంగాల్లో ముందంజలో నిలపగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు

# తెలంగాణకు కొత్త నాయకత్వం అవసరం

- పంచాయతీల నుంచే అభివృద్ధి ప్రస్థానం మొదలుపెడదాం
- ఈ గడ్డపై పుట్టిన పార్టీ జనసేన
- ఈ నేల పోరాట స్ఫూర్తిని, రాజకీయ ధైర్యాన్ని ఇచ్చింది
- దశాబ్ద కాలం తర్వాత దక్కిన విజయం ఇదే
- మీ విజయం సరికొత్త మార్పుకు నాంది కావాలి
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**వేద న్యూస్, కొండగట్టు:**

తెలంగాణ ప్రజలకు కొత్త నాయకత్వం అవసరమని, పంచాయతీల నుంచే అభివృద్ధి ప్రస్థానం ప్రారంభించాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అన్నారు. శనివారం కొండగట్టు పర్యటనలో భాగంగా తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన జనసేన పార్టీ సర్పంచులు, వార్డు మెంబర్లతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయన విజేత అభ్యర్థులకు పేరు పేరునా అభినందనలు తెలిపారు. పోటీ చేసిన సంఖ్యలో 50 శాతం విజయం సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ..

మిగతా 3వ పేజీలో..

# అన్నంలో విషం కలిపి చంపేయండి

- సిబ్బందికి ఆదేశాలు జారీ చేసిన హాస్టల్ వార్డెన్
- ఆడియో వైరల్.. సస్పెండ్ చేసిన కలెక్టర్
- తన ఫిర్యాదు చేశారన్న కోపంతో విద్యార్థులపై దూషణల పర్వం

3లో..



# అవయవ దానంతో ఆరుగురికి ఊపిరి!

- రోడ్డ ప్రమాదంలో లింగయ్య కు బ్రెయిన్ డెడ్
- భర్తను కోల్పోయిన బాధలోనూ గొప్ప నిర్ణయం తీసుకున్న యాదమ్మ



3లో..

# హామీల అమలే కోరితే నిర్బంధాలా?

- అరెస్టయిన ఆటో యూనియన్ నేతలను వెంటనే విడుదల చేయాలి
- అసెంబ్లీలోనే స్పష్టమైన ప్రకటన చేయాలి
- ఆటో డ్రైవర్ల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించిన కేటీఆర్

3లో..

వేద న్యూస్

ఆదివారం జనవరి 04, 2026

# పిల్లలకు ఫోన్ ఇచ్చి సాగర్‌లోకి దూకిన మహిళ

- హైదరాబాద్లో హృదయ విదారక ఘటన
- నాలుగేళ్ల క్రితం తండ్రి మృతి.. అనాథలుగా చిన్నారులు

**వేద న్యూస్, హైదరాబాద్:**

'పిల్లలూ... ఇక్కడ కూర్చొని ఈ ఫోన్‌తో ఆడుకోండి.. నేను కాసేపట్లో వస్తా' అంటూ వెళ్లిన తల్లి తిరిగి రాలేదు. నాలుగేళ్ల క్రితం తండ్రిని కోల్పోయిన ఆ చిన్నారులు.. ఇప్పుడు తల్లిని కూడా కోల్పోయారు. ఈ హృదయ విదారక ఘటన శుక్రవారం హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. లేక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పహాడీషరీఫ్‌కు చెందిన వసంత (29) భర్త లక్ష్మణ్ నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. వీరికి కుమారుడు నందు, కుమార్తె చెర్రీ ఉన్నారు. భర్త మృతి అనంతరం తల్లి, సోదరుడితో కలిసి ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు తీవ్రంగా ఉండటంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. శుక్రవారం సాయంత్రం పిల్లలను తీసుకుని ట్యాంక్‌బండ్‌కు వచ్చిన వసంత, లవ్ హైదరాబాద్ సమీపంలోని బెంచ్‌పై పిల్లలను కూర్చోబెట్టి మొబైల్ ఫోన్ ఇచ్చి ఆడుకోమని చెప్పింది. అనంతరం హుసేన్ సాగర్ వైపు వెళ్లి నీటిలో దూకింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో




వారు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. అయితే అప్పటికే ఆమె నీటిలో మునిగిపోయింది. గాలింపు చర్యల్లో మృతదేహాన్ని గుర్తించి వెలికితీశారు. పిల్లల వద్ద ఉన్న మొబైల్ ఫోన్ ఆధారంగా మృతురాలిని వసంతగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**వేద న్యూస్, మందమర్రి టౌన్ :**



భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 195 వ జయంతి వేడుకలను మందమర్రి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శనివారం పట్టణంలోని ఫిల్టర్ బెడ్ ఏరియాలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళ లోకానికి ఆదర్శం అని, సమాజంలో మహిళలకు విద్య, సమాన హక్కుల కోసం సావిత్రిబాయి పూలే చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆమె చూపిన మార్గాన్ని అనుసరించి విద్య సామాజిక అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మజ చేతుల మీదుగా బహుమతులు అందజేసి మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉమాదేవి, భీమ్ పుత్ర శ్రీనివాస్, లలిత, రవి, రజిత, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్య బలోపేతానికి సర్పంచ్‌ల సహకారం అవసరం

- కాలేజీ ప్రిన్సిపాల్ దేవరాజం

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ విద్యను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో, మండలంలోని నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజం మాట్లాడుతూ.. విద్యార్థుల హాజరు పెంపు, డ్రాపౌట్స్ తగ్గింపు, తల్లిదండ్రులతో సమన్వయం వంటి అంశాల్లో సర్పంచ్‌ల సహకారం కీలకమని పేర్కొన్నారు. కళాశాలలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చేపడుతున్న చర్యలను వివరించారు. అధ్యాపకులు మాట్లాడుతూ.. కెరీర్ గైడెన్స్, స్పోకెన్ ఇంగ్లిష్, స్కిల్ డెవలప్‌మెంట్, పోటీ పరీక్షల శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతోందని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న సర్పంచ్‌లు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకుల కృషిని అభినందిస్తూ, విద్యా నాణ్యత



పెంపు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యార్థుల హాజరు పెంచే విషయంలో గ్రామ పంచాయతీల తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంతో కళాశాల, గ్రామ పంచాయతీల మధ్య సమన్వయం మరింత బలపడిందని నిర్వాహకులు తెలిపారు.

# కస్తూర్బా పాఠశాలలో విద్యార్థిని మృతి

**వేద న్యూస్, సిద్ధిపేట అర్బన్:**



సిద్ధిపేట జిల్లా అర్బన్ మండలం మిట్టపల్లి కస్తూర్బా గాంధీ పాఠశాలలో శనివారం తెల్లవారుజామున ఓ విద్యార్థిని అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన కలకలం రేపింది. మృతురాలు బెజ్జంకి మండలం కల్లేపల్లి గ్రామానికి చెందిన గుర్రం తిరుపతి రెడ్డి, శ్రావణి దంపతుల కుమార్తె హర్షిణి (7వ తరగతి)గా గుర్తించారు. ఆమె సోదరి వర్షా 9వ తరగతి చదువుతోంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నిత్యక్రమం ప్రకారమే రాత్రి భోజనం చేసిన అనంతరం హాస్టల్‌లో తోటి విద్యార్థులతో కలిసి ఆడుకుంటున్న హర్షిణి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. విషయం గమనించిన విద్యార్థులు వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేయడంతో, వారు ఆమెను హుటాహుటిన సురభి మెడికల్ కాలేజ్కు తరలించారు. అయితే అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్ధిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండు సంవత్సరాల క్రితం హర్షిణిని పాఠశాలలో చేర్పించినట్లు తండ్రి తిరుపతి రెడ్డి తెలిపారు. ఘటనపై సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు పంచనామా నిర్వహించి, మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. పోస్టు మార్టం నివేదిక వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

# పోలీసుల తనిఖీలు



**వేద న్యూస్, అల్లాదుర్గ్:**

మెదక్ జిల్లా అల్లాదుర్గ్ మండలంలో ప్రజా భద్రత, యువత రక్షణ లక్ష్యంగా పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు అల్లాదుర్గ్ ఎస్ఐ శంకర్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి ఐబీ చౌరస్తా పరిధిలోని కిరాణా షాపులు, కల్లు దుకాణాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో గంజాయి, నిషేధిత డ్రగ్స్, నకిలీ మందులు వంటి మత్తు పదార్థాల విక్రయాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను పోలీసులు హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రజలకు మత్తు పదార్థాల వల్ల కలిగే ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు. యువతను మత్తు పదార్థాల నుంచి దూరంగా ఉంచడమే లక్ష్యమని పోలీసులు స్పష్టం చేశారు. స్థానికులు, వ్యాపారులు పోలీసుల చర్యలను స్వాగతిస్తూ సహకారం అందించారు.

# నమ్మకాన్ని నిలబెట్టుకుంటా



- సర్పంచ్ లావూరి మంగ్త నాయక్

**వేదన్యూస్, దామరచర్ల :**

ప్రజలు నాపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించారని.. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్ని దామరచర్ల మండలంలోని బొల్లిగుట్ట తండా నూతన సర్పంచ్ గా ఎన్నికైన లావూరి మంగ్త నాయక్ అన్నారు. దామరచర్లలో శనివారం వేదన్యూస్ తో మాట్లాడారు. ప్రజల నమ్మకాని కి తగ్గట్టుగా తండాను అభివృద్ధి చేస్తానని చెప్పారు. తండాలోని అన్ని సమస్యలను విడతల వారిగా పరిష్కరిస్తానని ఆయన పేర్కొన్నారు. మొదటి మౌలిక వసతులను మెరుగు పర్చాల్సివుందన్నారు. పాత రోడ్లు, మురుగు కాల్వల కు మరమ్మతులు చేయడంతోపాటు కొత్తవి నిర్మించాల్సి ఉందన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటానాని చెప్పారు. వీధి లైట్లు, పరిశుభ్రతపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టనున్నట్లు తెలిపారు. చెట్లను పెద్దఎత్తున పెంచి పచ్చదనాన్ని పెంపొందించనున్నట్లు చెప్పారు. గ్రామంలోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

# డ్రగ్స్ నియంత్రణ చర్యలు చేపడుదాం

- సర్పంచ్ నల్ల మోహన్

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి గ్రామంలో డ్రగ్స్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని సర్పంచ్ మోహన్ ఆధ్వర్యంలో శనివారం పంచాయతీ గ్రామసభలో తీర్మానం చేశారు, గ్రామంలోని యువత, మత్తు పదార్థాలకు, బానిసై జీవితలను నాశనం చేసుకుంటున్నారని అధికారులతో కలిసి అరికడుతామని అన్నారు. వీటితో పాటు గ్రామంలో మంచినీటి సమస్య-నాంది ఫౌండేషన్ ప్లాంట్, విధి దీపాలు, బస్టాండ్ దగ్గరలో టాయిలెట్ నిర్మాణం, ఓపెన్ జిమ్, రన్నింగ్ ట్రాక్, డ్రైనేజీ నిర్మాణం, కోతుల బెడద నుండి రక్షణ, పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా చూస్తానన్నారు. గ్రామంలో ఏ సమస్య అయినా పరిష్కారం చేసుకుందామని సర్పంచ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మెరుపుల చందన, వార్డు సభ్యులు, సెక్రటరీ, కారోబారి, గ్రామపెద్దలు, యువత, ప్రజలు విద్యావేత్తలు, పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామ హైస్కూల్‌లో స్థానిక సర్పంచ్ గన్నేరం వసంత నర్సయ్య, ఉప సర్పంచ్ ఎలావేని రమేష్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా స్త్రీ విద్యకు పునాదులు వేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని, ఆమె సేవలను జయంతి సందర్భంగా స్మరించుకోవడం గర్వకారణమన్నారు. ఆమె జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్న ఈ రోజున, మహిళా ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో పోషిస్తున్న కీలక పాత్రకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని నిరూపించిన సావిత్రిబాయి పూలే ఆశయాలు.. సమానత్వం, విద్య, న్యాయం నేటికీ అందరికీ ప్రేరణగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత మనందరిదని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, అన్ని కుల సంఘాల అధ్యక్షులు, హైస్కూల్, ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మహిళా విద్యకు ఆద్యురాలు సావిత్రిబాయి పూలే

- కేయూ వీసీ కె. ప్రతాప్ రెడ్డి
- మహిళలు మానసికంగా ఎంతో బలమైనవారు
- వరంగల్ కలెక్టర్ సత్య శారద
- కేయూలో ఘనంగా ఉమెన్స్ టీచర్స్ డే

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

మహిళా ఉద్యోగులు తమ సంపూర్ణ శక్తి, సామర్థ్యాలతో విశ్వవిద్యాలయ అభివృద్ధికి కీలకంగా దోహదపడుతున్నారని కేయూ ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం సెనేట్ హాల్‌లో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని మహిళా ఉపా ధ్యాయినుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేయూ ఉపకులపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే గొప్ప సామాజిక సంస్కర్తగా, మహిళా విద్యకు ఆద్యురాలిగా చరిత్రలో నిలిచారని కొనియాడారు. మహిళల కృషి సమాజ నిర్మాణంలో అత్యంత ముఖ్యమని, తల్లి తొలి గురువని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన వరంగల్ కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. మహిళలు



మానసికంగా, భావోద్వేగపరంగా ఎంతో బలమైనవారని అన్నారు. బాలిక విద్య ద్వారానే సమాజంలో గణనీయమైన మార్పు సాధ్యమైందని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులు డాక్టర్ బి. దీపా జ్యోతి మాట్లాడుతూ, జ్ఞానం మహిళకు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ఆత్మవిశ్వాసమే సాధికారతకు మూలమని అన్నారు. వివక్ష ఉన్న కాలంలో ధైర్యంగా మహిళా విద్యకు బాట వేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గొప్ప సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



కాకతీయ విశ్వవిద్యాలయం బీసీ సెల్ సంచాలకులు డాక్టర్ బి. సతీష్ అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా దూర విద్య కేంద్ర ప్రాంగణంలో ఉన్న సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేయూ ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే గొప్ప సామాజిక సంస్కర్తగా, మహిళా విద్యకు ఆద్యురాలిగా చరిత్రలో నిలిచారని అన్నారు. ఆమె ఆశయాలు, స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, పాలక మండలి సభ్యులు ఆచార్య బి. సురేష్ లాల్, డాక్టర్ బి. రమ, డాక్టర్ సుకుమారి, డాక్టర్ చిర్రా రాజుతో పాటు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మోటార్ వైర్ల దొంగతనం

- పదిమంది రైతులకు నష్టం
- వరుస ఘటనలతో గ్రామంలో ఆందోళన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతులు



**వేద న్యూస్, కరీంనగర్:**

గుర్తు తెలియని దొంగలు వ్యవసాయ బోర్లకు సంబంధించిన విద్యుత్ వైర్లను ఎత్తుకెళ్లడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల ం నుస్తులాపూర్ గ్రామంలో రైతుల మోటార్ విద్యుత్ వైర్ల దొంగతనం కలకలం రేపింది. ఈ ఘటనలో సుమారు పదిమంది రైతులకు నష్టం వాటిల్లగా, ఒక్కో రైతుకు రూ.25 వేల వరకు నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. బోర్లకు వేసిన వైర్లను ఒక్కో రైతు వద్ద 5 నుంచి 8 సార్లు దొంగలు ఎత్తుకెళ్లినట్లు సమాచారం. పదేపదే దొంగతనాలు జరుగుతున్నా చర్యలు లేకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దొంగలను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. రైతుల ఫిర్యాదు మేరకు తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మండల సీఐ సదన్ కుమార్, ఎస్ఐ శ్రీకాంత్, నుస్తులాపూర్ గ్రామ సర్పంచ్ తుమ్మనపల్లి సంధ్య శ్రీనివాసరావుతో కలిసి దొంగతనం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. విద్యుత్ వైర్ల నుంచి వేరు చేసిన కాపర్‌ను చెట్లు, పొదల్లో దాచిన ప్రాంతాలను పోలీసులు గుర్తించి తనిఖీ చేశారు. ఈ ఘటనపై దర్యాప్తును ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు. దొంగతనాలకు పాల్పడిన వారిని త్వరలోనే పట్టుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలో రాత్రి గస్తీ పెంచాలని రైతులు కోరుతున్నారు.

# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నూతన సర్పంచ్‌కు సన్మానం

**వేద న్యూస్, గంగాధర:**



గంగాధర మండలం గట్టుబూత్కూర్ గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ మల్కాపురం రాజేశ్వరి–మల్కాపురం రాజేశం దంపతులను పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొల్లి గణేష్ నేతృత్వంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజేశ్వరి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో గెలిపించిన గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ ఋణపడి ఉంటానని తెలిపారు. గ్రామ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని పారదర్శక పాలన అందిస్తూ, పలు సేవా కార్యక్రమాలను చేపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కుల పెద్దలు, కుల బంధువులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని నూతన సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# తెలంగాణకు కొత్త నాయకత్వం అవసరం

సర్పంచులు, వార్డు మెంబర్లుగా విజయం సాధించడం ద్వారా మీరు చాలా పెద్ద అడుగు వేశారని, ఎంత పెద్ద ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలవుతుందని వ్యాఖ్యానించారు. ఈ రోజు మీరు వేసిన అడుగు సరికొత్త మార్పుకు నాంది కావాలని ఆకాంక్షించారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున 53 మంది అభ్యర్థులు విజయం సాధించారని, దశాబ్ద కాలం తర్వాత తెలంగాణలో దక్కిన విజయం ఇదేనని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. విజయం సాధించిన ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరుకుంటున్నానన్నారు. తెలంగాణ నేల తనకు పోరాట స్ఫూర్తిని, రాజకీయ ధైర్యాన్ని ఇచ్చిందని తెలిపారు.తెలంగాణలో పుట్టిన పార్టీ జనసేన అని, ఇక్కడి ప్రజలకు అండగా నిలవాల్సిన బాధ్యత అందరిదని పవన్ కళ్యాణ్ అన్నారు. తెలంగాణకు బలమైన యువ నాయకత్వం అవసరమని, మీ స్థాయి, మీ ప్రాంతాన్ని బట్టి ప్రజల కోసం పోరాటం చేయాలని సూచించారు. సిద్ధాంత బలంతో సహజంగా ఎదిగితే విభేదించడం ఎవరికీ సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకున్నానంటే తెలంగాణ అమరవీరులు ఇచ్చిన స్ఫూర్తే కారణమని పవన్ కళ్యాణ్ తెలిపారు. రజాకార్లపై తెలంగాణ ప్రజలు చేసిన పోరాటం తనకు ఎప్పటికీ ప్రేరణగా నిలిచిందన్నారు. సమయం, క్రమశిక్షణ ఉంటే రాజకీయాల్లో మంచి స్థాయికి చేరుకోవచ్చని విజేతలకు సూచించారు. ఈ సమావేశంలో పార్టీ తెలంగాణ ఇంఛార్జ్, టీటీడీ ఎల్.ఏ.సి. ఛైర్మన్ శంకర్ గౌడ్, పార్టీ ఉపాధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు బి. మహేందర్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, పార్టీ నాయకులు రాధారం రాజలింగం, ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, ఆర్.కె. సాగర్, శ్రీమతి శిరీష తదితరులు పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు క్షేమంగా ఉండాలని, తెలుగు ప్రజల ఐక్యత కోసం కలిసి పనిచేద్దామని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

**వేద న్యూస్, శంకరపట్నం:**



మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అర్ధాంగి సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలు శంకరపట్నం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ గోదారి రాజేంద్ర ప్రసాద్, ఉపసర్పంచ్ విజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి మహిళా స్వేచ్ఛకు పునాది సావిత్రిబాయి పూలే వేసిన విద్యేనని పేర్కొన్నారు. మహిళా విద్య, సాధికారత కోసం ఆమె చేసిన సేవలు అనన్యసాధారణమని తెలిపారు. బాల్యవివాహాలు, మూఢనమ్మకాల నిర్మూలన, వితంతు పునర్వివాహం వంటి అంశాల్లో ఆమె భర్తతో కలిసి చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం మండల అధ్యక్షుడు బొంగుని అభిలాష్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ గజ్జెల్లి హనుమంతు, ముత్తారం ఉపసర్పంచ్ శ్రవణ్ గౌడ్, పంజాల సంపత్, గుడిశాల తిరుపతి, బీసీ సంఘం నాయకులు బొంగోని శ్రావణ్ గౌడ్, కొత్తపల్లి అశోక్, గడ్డం శ్రీకాంత్, ఎండి షారుఖ్ తదితరులు పాల్గొన్నారు

# హామీల అమలే కోరితే నిర్బంధాలా?

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు, ఆటో యూనియన్ల నేతలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ అంశాన్ని అసెంబ్లీ దృష్టికి తీసుకువస్తామని, అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన ఆటో డ్రైవర్ల జేఏసీ నేతలను, వేలాది మంది ఆటో డ్రైవర్లను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై ఆయన మండిపడ్డారు. నిన్నటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు, ఆటో యూనియన్ల నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. వేలాది మందిని అనేక పోలీస్ స్టేషన్లలో బంధించి ఉంచడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసి, వాటిని ప్రశ్నించినందుకే నిర్బంధాలు, అరెస్టులతో గొంతు నొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అరెస్టు చేసిన ఆటో యూనియన్ల నేతలను, ఆటో డ్రైవర్లను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటనను, ఆటో అన్నలు కోరినట్లుగానే ఈరోజే అసెంబ్లీలో ప్రభుత్వం చేయాలని కోరారు. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన ప్రభుత్వం, బలవంతపు చర్యలకు దిగడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు కొనసాగకుండా ఉండాలంటే, వారికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాల్సిందేనని కేటీఆర్ స్పష్టం చేశారు. కష్టజీవులైన ఆటో డ్రైవర్లకు అండగా బీఆర్ఎస్ నిలుస్తుందని, వారి న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు.




# పీఎల్‌జీఏ బెటాలియన్‌పూర్తిగా క్షీణించింది

పోలీసుశాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని డీజీపీ స్పష్టం చేశారు. పునరావాసం, ఉపాధి, భద్రత వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తుందని తెలిపారు. హింసను వదిలి శాంతి మార్గాన్ని ఎంచుకుంటే జీవితాన్ని కొత్తగా ప్రారంభించే అవకాశాలు ఉంటాయని భరోసా ఇచ్చారు.రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డీజీపీ తెలిపారు. మావోయిస్టు ప్రభావం పూర్తిగా తగ్గుముఖం పట్టిందని, భద్రతా బలగాల సమన్వయ చర్యల వల్ల ప్రజలకు సురక్షిత వాతావరణం ఏర్పడుతోందని పేర్కొన్నారు. తెలంగాణలో శాంతి, అభివృద్ధి దిశగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని డీజీపీ స్పష్టం చేశారు.

# అవయవ దానంతో ఆరుగురికి ఊపిరి!

**వేద న్యూస్, నల్గొండ:**

భౌతికంగా దూరమైనా.. అవయవదానంతో ప్రాణదాతగా చిరస్థాయిలో నిలిచిపోయారు నల్గొండ జిల్లాకు చెందిన ఏరుకొండ లింగయ్య. లింగయ్య రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించబడ్డారు. ఈ విషాదం మధ్య ఆయన కుటుంబం చేసిన త్యాగం ఆరుగురు జీవితాల్లో వెలుగులు నింపింది. భర్తను కోల్పోయిన దు'ఖంలోనూ యాదమ్మ అపూర్వమైన ధైర్యం చూపించారు. భర్త తిరిగిరారని తెలిసినా, ఇతరుల రూపంలో ఆయన బతికుండాలని కోరుతూ అవయవదానానికి సమ్మతించారు. ఆ బాధలోనూ ఆమె తీసుకున్న నిర్ణయం మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. లింగయ్య కిడ్నీలు, కాలేయం, ఊపిరితిత్తులు, కళ్లను దానం చేయడంతో ఆరుగురు ప్రాణాలకు కొత్త జీవితం లభించింది. మరణం ఒక ముగింపు కాదని, అవయవదానం ద్వారా అది కొత్త ఆరంభమవుతుందన్న సత్యాన్ని ఈ సంఘటన స్పష్టంగా చాటింది. ఒక్క కుటుంబం తీసుకున్న నిర్ణయం ఆరుగురు కుటుంబాల్లో ఆశలను పూయించింది. వైద్యుల ప్రకారం అవయవదానంపై ఇంకా అపోహలు ఉన్నా, లింగయ్య–యాదమ్మ చూపిన మార్గం అవయవదానం మహాదానం అనే సందేశాన్ని బలంగా చాటుతోంది. ఒకరి నిర్ణయం అనేక మందిని కాపాడగలదని ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోంది.



# మల్కేపల్లి ధర్మారావుపేట మార్గంలో వాగు పరిశీలన


**వేద న్యూస్, కాసిపేట :**

మల్కేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో మల్కేపల్లి నుంచి ధర్మారావుపేటకు పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సర్పంచ్ కొట్నాక రఘుపతి రావు పరిశీలించారు. వాగులో చెట్లు పెరిగి మార్గం అడ్డంకిగా మారిన పరిస్థితిని ఆయన గమనించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఉప సర్పంచ్ జంజిరాల సందీప్, మాజీ ఎంపీటీసీ మాడవి భీం రావు, కోడూరి విద్యా సాగర్, తాటిపాముల సాయి చరణ్, సల్లం వెంకట్రావు తదితరులు సర్పంచ్‌తో కలిసి పరిశీలనలో పాల్గొన్నారు.



# అసెంబ్లీని గాంధీభవన్‌లా నడుపుతున్నారు

- స్పీకర్ పక్షపాత వైఖరి వీడాలి
- ప్రతిపక్ష సభ్యుల గొంతు నొక్కడం సరికాదు
- మాజీ మంత్రి గంగుల కమలాకర్



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

అసెంబ్లీని గాంధీభవన్‌లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్యాలెస్‌లా నడుపుతున్నారని.., స్పీకర్ పక్షపాత వైఖరి వీడి, ప్రతిపక్షాలకు సమాన హక్కులు కల్పించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో అసెంబ్లీ నిర్వహణ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రి రెండు గంటలపాటు మాట్లాడటం సభ సంప్రదాయాలకు విరుద్ధమని గంగుల కమలాకర్ అన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడేందుకు వేరే వేదిక ఉండాలని, ప్రశ్నోత్తరాల్లో ప్రతిపక్ష సభ్యుల గొంతు నొక్కడం సరికాదన్నారు. అజెండాను అదే రోజు ఉదయం ఇవ్వడం కూడా తగదని విమర్శించారు. సభకు ముఖ్యమంత్రి ప్రతిపక్షాలను అవమానించేందుకే వచ్చారని ఆరోపిస్తూ, సభ్యుల హక్కులను కాలరాస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి ఎంత హక్కు ఉంటుందో ప్రతిపక్ష సభ్యులకు కూడా అంతే హక్కు ఉంటుందని స్పష్టం చేశారు. మాట్లాడేందుకు మైక్ ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఉపాధి హామీ పథకంపై చర్చకు తాను, జగదీష్ రెడ్డి సిద్ధమని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అసెంబ్లీ హుందాగా నడిచిందని, అప్పటి స్పీకర్లు ప్రతిపక్షాలకు తగిన సమయం ఇచ్చేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం స్పీకర్, ముఖ్యమంత్రి ఇద్దరూ అసెంబ్లీ సంప్రదాయాలను తుంగలో తొక్కుతున్నారని గంగుల కమలాకర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# అన్నంలో విషం కలిపి చంపేయండి

**వేద న్యూస్, సంగారెడ్డి:**



తనపై ఫిర్యాదు చేశారన్న కోపంతో వసతి గృహ విద్యార్థులను చంపేయాలని వార్డెన్ కిషన్ నాయక్ సిబ్బందిని ఆదేశించినట్లు ఉన్న ఆడియో వైరల్ కావడం తీవ్ర కలకలం రేపింది. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహంలో సంచలన ఘటన వెలుగుచూసింది. విద్యార్థులపై అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపణల నేపథ్యంలో, గురువారం రాత్రి విద్యార్థులు కద్పల్–సిర్గాపూర్ రహదారిపై ఆందోళనకు దిగారు. అధికారులు వసతి గృహానికి చేరుకుని విచారణ చేపట్టగా, విద్యార్థులు వార్డెన్‌పై రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన వార్డెన్, మద్యం మత్తులో వసతి గృహానికి చేరుకుని విద్యార్థులపై బూతులతో దూషించినట్టు సమాచారం. అంతటితో ఆగకుండా హాస్టల్ సిబ్బందికి ఫోన్ చేసి, 'నా మీదే ఫిర్యాదు చేస్తారా? వాళ్ల అన్నంలో విషం కలిపి చంపేయండి' అంటూ ఆదేశాలు జారీ చేసినట్లు ఆడియోలో ఉంది. ఈ ఆడియో బయటకు రావడంతో సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. ఘటనపై ప్రావీణ్య తక్షణమే స్పందించి, విధుల్లో నిర్లక్ష్యం వహించడమే కాకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడాలని చూసిన వార్డెన్ కిషన్ నాయక్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఘటనపై మరింత విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

# వీర బాలల త్యాగాలు మరువలేనివి

**– కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి**




**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

బాల వీరుల త్యాగం, ధైర్యం చరిత్రలో అజరామరమని, నేటి యువత వీరి గాథల ద్వారా దేశం, ధర్మం కోసం త్యాగ భావనను అలవరుచుకోవాలని కేయూ ఉపకులపతి ప్రొ. కె. ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీ గోల్డెన్ జూబ్లి ఉత్సవాల్లో భాగంగా కాకతీయ యూనివర్సిటీ డీన్ స్టూడెంట్ అఫైర్స్, సోషాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగాల ఆధ్వర్యంలో శనివారం సెనేట్ హాల్‌లో వీర్ బాల్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'వీర్ బాల్ దివస్ – జాతి నిర్మాణం' అనే అంశంపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడారు. విశిష్ట అతిథిగా రిజిస్ట్రార్ ప్రొ. వి. రామచంద్రం, గౌరవ అతిథిగా యూనివర్సిటీ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మమత, ముఖ్య వక్తగా సర్దార్ జగ్బీర్ సింగ్ ఖల్సా పాల్గొని మాట్లాడారు. ఫతే సింగ్, జొరావర్ సింగ్ వంటి బాల వీరుల ధర్మ నిష్ఠ ప్రపంచ చరిత్రలో అపూర్వమని కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ ఎం. స్వర్ణలత (హెచ్‌వోడీ), ప్రొ. మామిడాల ఇస్తారి సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి 136 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, విజేతలకు వీసీ బహుమతులు అందజేశారు.

# స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో పూలే జయంతి

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**




స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య ప్రాంగణంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ మాట్లాడుతూ... భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా అనేక అవమానాలను ఎదుర్కొని మహిళలకు విద్య అనే ఆయుధాన్ని అందించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ఆమె స్ఫూర్తితో నేటి సమాజంలో మహిళలు రాజకీయ, ఆర్థిక, వ్యాపార రంగాల్లో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ కేయూ అధ్యక్షులు మోజేష్, సుఖేష్, రాకేష్, రావణ్, మహేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి చరిత్రలో నిలిచారు

**– రుక్మాపూర్ జెడ్‌పీహెచ్‌ఎస్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీధర్**




**వేద న్యూస్, చొప్పదండి:**

స్త్రీల విద్య, బాలికల విద్య కోసం సావిత్రిబాయి పూలే చేసిన సేవలు అమూ ల్యమని, మూఢవిశ్వాసాల నిర్మూలన, స్త్రీ, బాలిక సమానత్వం కోసం ఆమె చేసిన పోరాటాలు నేటికీ ప్రేరణగా నిలుస్తున్నాయని రుక్మా పూర్ జెడ్‌పీహెచ్‌ఎస్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు పసుపునూరి శ్రీధర్ అన్నారు. పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి కార్య క్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమె చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మాధవరపు శారదను శాలువాతో సన్మానించారు. ఉపా ధ్యా యులు సముద్రాల అంజయ్య, సురేందర్, మల్లికార్జున్, సీఆర్‌పీలు సురేందర్, జూనియర్ అసిస్టెంట్ ఉదయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

# యూరియా యాప్ బాగా పనిచేస్తుంది

**– మండల వ్యవసాయ అధికారి**

**వేద న్యూస్, దామరచర్ల:**



యూరియా యాప్ రైతులకు ఎంతో ఉపయోగకరంగా పనిచేస్తోందని మండల వ్యవసాయ అధికారి రుషేంద్ర మణి తెలిపారు. శనివారం దామరచర్లలోని ఒక ఎరువుల దుకాణం వద్ద రైతులను కలిసి యాప్ వినియోగంపై ఆరా తీసిన అనంతరం ఆమె మాట్లాడారు. యూరియా యాప్ ద్వారా రైతులు ఇంట్లో నుంచే యూరియాను బుక్ చేసుకుని, అదే రోజున తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. దీని వల్ల ఎరువుల దుకాణాల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు. అలాగే బ్లాక్ మార్కెట్ సమస్యలు తగ్గి, రైతులు నేరుగా ప్రభుత్వ ధరకే యూరియాను పొందగలుగుతారని వివరించారు. ఫెర్టిలైజర్ డీలర్లు కూడా నిబంధనల ప్రకారం ప్రభుత్వ ధరకే యూరియా విక్రయించాలని సూచించారు. ఇప్పటికే పలువురు రైతులు యాప్ డౌన్‌లోడ్ చేసుకుని యూరియాను పొందుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు యాప్‌పై సంతృప్తి వ్యక్తం చేశారు.

# బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**వేద న్యూస్, మందమర్రి టౌన్ :**




మహిళా విద్యకు పునాదులు వేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షులు ముదారపు శేఖర్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు ముదారపు శేఖర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండిళ్ల శ్రీనివాస్ లు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే గొప్ప సంఘసంస్కర్త, సామాజిక రుగ్మతలపై పోరాడి అణగారిన వర్గాలకు అండగా నిలబడి మహిళల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసిన వీర వనిత అని అన్నారు. దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా బాధ్యతలు చేపట్టి చరిత్రలో చిరస్మరణీయగా నిలిచిపోయిన గొప్ప సంఘసంస్కర్త అని ఆమె స్ఫూర్తితోనేనేడు మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని పూలే దంపతుల ఆశయాలను కొనసాగిస్తూ బీసీల హక్కుల కోసం పోరాడుదాం అని, బీసీలకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు సాధించినప్పుడే ఆమె కల సాకారం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా యూత్ ఉపాధ్యక్షులు రాయబారపు కిరణ్, తాడిగొప్పుల రవి రాజా, మద్ది వేణుగోపాల్ గౌడ్, ఎండి కలీం, నల్లగొండ రమేష్, జె సత్యనారాయణ, చింతల రమేష్, నాగరాజు, అయాన్, వంశీ తదితరులు పాల్గొన్నారు

# ఎల్లా గౌడ్ సేవలు చిరస్మరణీయం

**వేద న్యూస్, మందమర్రి టౌన్ :**



మాజీ గీత పారిశ్రామికవేత్త డైరెక్టర్ నోముల ఎల్లా గౌడ్ సేవలు చిరస్మరణీయమని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు అన్నారు. శనివారం స్థానిక సింగరేణి మనోవికాస్ పాఠశాలలో ఎల్లా గౌడ్ వర్ధంతి వేడుకలను విద్యార్థుల సమక్షంలో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఎల్లా గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సోతుకు సుదర్శన్ లు మాట్లాడుతూ ఎల్లా గౌడ్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడని మందమర్రి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ఓ బి సి సెల్ చైర్మన్ గా, రాష్ట్ర గీత పారిశ్రామిక డైరెక్టర్ గా ఎన్నో ఉన్నత పదవులు నిర్వహించారని ఆయన చేపట్టిన ప్రతి పదవికి న్యాయం చేశారని పేర్కొన్నారు. పట్టణంలో కాంగ్రెస్ కార్యకర్తలకు గాని ప్రజలకు కానీ ఇలాంటి ఇబ్బందులు తలెత్తిన నేను ఉన్నాను అంటూ ప్రతి ఒక్కరి సమస్యలను తెలు సుకుని వాటిని తీర్చడంలో ముందుండే వారిని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, సీనియర్ నాయకులు పుల్లూరి లక్ష్మణ్, బానోతు నీలయ్య, సట్ల రవి, గుడ్ల రమేష్, నెరువట్ల శ్రీనివాస్, పైడిమల్ల నర్సింగ్, గోగుల రాజయ్య, మంకు రమేష్, మంద తిరుమల్, వేటూరి సత్యనారాయణ, సుకూర్, ఎర్ర రాజు, బుర్ర ఆంజనేయులు, బండి శంకర్, యూత్ నాయకు లు సట్ల సంతోష్, మాయ తిరుపతి, ముదారపు శేఖర్, మహంత్ అర్జున్, రాయబారపు కిరణ్, సోతుకు ఉదయ్, వద్లూరి సునీల్ కుమార్, జావీద్, వీరన్న, తుంగ పిండి విజయ్, అందుగుల లక్ష్మణ్, కడలి శ్రీనివాస్, విజయ్, కందుల ఓదెలు, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

# కాల్వల మెయింటెనెన్స్‌పై తీవ్ర నిర్లక్ష్యం

- గత, ప్రస్తుత ప్రభుత్వాలు నిధులు కేటాయించలేదు
- రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- ఎస్సారెస్పీ స్టేజ్ 2 కాల్వ పరిశీలన



**వేద న్యూస్, తుంగతుర్తి :**

కాల్వల మెయింటెనెన్స్‌పై తీవ్ర నిర్లక్ష్యం చోటుచేసుకుందని, కాల్వల్లో కంప చెట్లు పెరిగిపోయి, శుభ్రత, మరమ్మతులు లేక నీటి ప్రవాహం అడ్డంకి పడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. తుంగతుర్తి, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాలకు సాగునీరు అందించే ఎస్సారెస్పీ స్టేజ్2 ప్రధాన కాల్వను తెలంగాణ జాగృతి కవిత పరిశీలించారు. అనంతరం కోదాడ మండలం వెలుగుపల్లి గ్రామ పరిధిలోని రుద్రమ చెరువును సందర్శించి సాగునీటి వసతులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అయినా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు నిధులు కేటాయించలేదని ఆరోపించారు. కోదాడ వరకు సాగునీరు అందించే డిస్ట్రిబ్యూటరీ కాల్వ సుమారు 70 కిలోమీటర్ల పొడవు ఉందని, దీనిని సరిగా నిర్వహించకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. అలాగే 700 ఎకరాల ఆయకట్టు కలిగిన రుద్రమ చెరువుకు గోదావరి నీళ్లు రావాల్సి ఉన్నా, కిలోమీటర్‌కు పైగా డిస్ట్రిబ్యూటరీ కాల్వ తవ్వకాలు జరగకపోవడంతో నీళ్లు చేరడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఈ చెరువును 5 టీఎంసీల రిజర్వాయర్‌గా అభివృద్ధి చేస్తామన్న హామీలు నెరవేరలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం లక్నవరం తరహాలో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నా ఇప్పటివరకు చర్యలు కనిపించడం లేదన్నారు. ఎస్సారె-స్పీ స్టేజ్ 2లో భాగంగా నల్గొండ జిల్లాలో రిజర్వాయర్ల నిర్మాణం చేసి రైతాంగానికి మేలు చేసేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు.

# చిన్నారులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ గ్రామానికి చెందిన కన్నే రిషికేష్ వర్మ పుట్టినరోజు సందర్భంగా రుద్రూర్ మండల కేంద్రంలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రతిమ, సునంద, సుజాత, పెద్ద గంగామణి, చిన్న పద్మతో పాటు కన్నే రవి, జమిల్, హాజీ, ఆర్మీ జవాన్ తోట వేణుగోపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మండల అధికారులను కలిసిన సర్పంచ్‌లు

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని సర్పంచులు అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. విలాసాగర్ గ్రామ సర్పంచ్ ఏనుగుల కనుకయ్య, జగ్గారావుపల్లి గ్రామ సర్పంచ్ సుద్దాల మధు శనివారం తహసీల్దార్ కాలే నారాయణ రెడ్డి, ఎంపీడీఓ, బీమా జయశీలను వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని సన్మానించి స్వీట్స్‌ను అందజేశారు.

# క్యాలెండర్ ఆవిష్కరణ

**వేద న్యూస్, చొప్పదండి:**



వాపా చొప్పదండి 2026 నూతన క్యాలెం డరు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చొప్ప దండి అధ్యక్షుడు పెద్ద పల్లి లక్ష్మణచారి, ఉపాధ్యక్షుడు వడ్లూరి బ్రహ్మానందం, ప్రధాన కార్య దర్శి చిలుకూనూరి మహేష్, గౌరవ అధ్యక్షులు గాలిపెల్లి బ్రహ్మ నందం, ఆర్థిక కార్యదర్శి గోవులకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# 99టీవీ క్యాలెండర్ ఆవిష్కరించిన కవిత

**వేద న్యూస్, హైదరాబాద్:**




తెలంగాణ జాగృతి కార్యాలయంలో జాగృతి అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా 99టీవీ 2026 క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. వరంగల్ జిల్లా సీనియర్ నాయకులు వెలిగేటి రవికుమార్–దంపతుల సౌజన్యంతో నాయకుల సమక్షంలో ఈ క్యాలెండర్ ఆవిష్కరణ జరిగినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో కవిత నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి కి పాటు పడే విధంగా తామంత కృషి చేస్తామని చెపుతునే సమాజంలో మీడియాకు ప్రత్యేక స్థానం ఉందని అందులో 99టీవీ తన పాత్ర సమర్ధవంతంగా పోషిస్తుంది అని కవిత తెలిపారు. క్యాలెండర్ ద్వారా రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర మరియు సంక్రాంతి, ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల విద్యకు పునాదివేసిన తొలి మహిళా పూలె

**వేద న్యూస్,అందోల్ :**



అందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండలం ఎలకుర్తి ప్రభుత్వ పాఠశాలలో శనివారం సావిత్రి బాయి పూలె 196వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి బాయి పూలె చిత్రపటానికి పుష్ప మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అమరేందర్ రెడ్డి, మరియు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల్య మాట్లాడుతూ మహిళా విద్యకు పునాది వేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలె అని పేర్కొన్నారు. సమాజంలో బాలికల విద్య, మహిళా సాధికారతకు ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని ఆమె చూపిన మార్గం నేటికీ ఆదర్శంగా నిలుస్తోందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని సావిత్రి బాయి పూలె జీవిత చరిత్రపై ప్రసంగాలు చేశారు. విద్యార్థులచే నిర్వహించిన ఉపన్యాసాలు, నినాదాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చివరగా విద్యార్థులు ఆమె ఆశయాలను తమ జీవితాల్లో అమలు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. తదనంతరం పాఠశాలలో మహిళల ఉపాధ్యాయురాలు అయినటువంటి శ్రీవిద్య, అరుణ మరియు మాలతి లను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులతో పాటు రమేష్, సిద్ధార్థ,శంకర్ రావు,సమీర్, శేఖర్,నరేష్, రాజశేఖర్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వీకేఎస్పీ క్లబ్ అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్ ప్రమాణం

- ప్రధాన కార్యదర్శిగా సంతోష్, కోశాధికారిగా పూర్ణచందర్..

**వేద న్యూస్, జమ్మికుంట:**




జమ్మికుంట వాసవి క్లబ్ ఇంట ర్నేషనల్ వికేఎస్పి జమ్మికుంట క్లబ్‌కు 2026 సంవత్సరానికి అధ్యక్షులుగా గుండా రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి చందా సంతోష్, కోశాధికారి చిదురాల పూర్ణచందర్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిరిపురం రాజేష్, గవర్నర్ పుల్లూరి బాలమోహన్, ఎల్లంకి ప్రదీప్‌లతోపాటు వైస్ గవర్నర్ తంగళ్ళపల్లి రాజభాస్కర్, రివిజన్ చైర్ పర్సన్ రామిడి శ్రీనివాస్, జోన్ చైర్ పర్సన్ అయితు రమేష్, వాసవి క్లబ్ అధికారులు కె వెంకటేశ్వర్లు, గంప సురేందర్, అయిత సుధాకర్, సుద్దాల శ్రీనివాస్, యాంసాని రమేష్ బాబు, బళ్ల రమేష్, పుట్టూరి రమేష్, అయిత రమాదేవి, రావికంటి నీలకంఠం, గుండా కేదారి, అయిత స్వాతి, గార్లతోపాటు వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. వికేఎస్పి క్లబ్ సేవలను అందరికీ అందే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

**వేద న్యూస్, కాసిపేట :**




మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం లోని దుబ్బగూడం గ్రామం, దేవాపూర్ పంచాయతీ నాయకపు గూడతో పాటు ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికలు), దేవాపూర్‌లలో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో నాయకపు గూడ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతులు వెలిగించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నూతన సర్పంచ్ సిడం రాందాస్ పాల్గొని మహిళా విద్యాభివృద్ధి, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన సేవలను కొనియాడారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దేవాపూర్‌లో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికలు), దేవాపూర్‌లో ప్రధానోపాధ్యాయులు రొడ్డ గోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థినులు ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో వివిధ రాజకీయ, సామాజిక సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



మున్సిపల్ ఓటర్ జాబితాపై ప్రజలకు సహాయం అందించేందుకు సిరిసిల్ల, వేము లవాడ మున్సిపల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఇటీవల విడుదలైన ఓటర్ జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే సంబంధిత మున్సిపల్ కమిషనర్ల దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. మున్సి పాలిటీల పరిధిలో వార్డుల వారీగా ఇంటి నంబర్ల ఆధారంగా ఓటర్ జాబితాలను మున్సిపల్ కార్యాల యాల నోటీస్ బోర్డులపై ప్రచురించినట్లు తెలిపారు. తమ ఓటు ఇంటి నంబర్‌కు అనుగుణంగా కాకుండా వేరే వార్డులో నమోదై ఉంటే, ఈ నెల 9వ తేదీలోగా సంబంధిత మున్సిపల్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆయా వార్డు లకు సంబంధించిన ఓటర్ జాబితాలు హెల్ప్‌డెస్క్‌ల వద్ద అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

## ప్రధాన న్యాయమూర్తికి న్యూ ఇయర్ విషెస్

**వేద న్యూస్, వేములవాడ:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజకు వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షు ంంంంండు గుడిసె సదానందం ఆధ్వర్యంలో కార్యవర్గం శనివారం శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో, ఆనందోత్సవాల మధ్య జీవితం గడపాలని కోరారు. అదేవిధంగా వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్, జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు కటకం జనార్దన్, కోళ్ల శ్రీనివాస్, గుజ్జే మనోహర్, కనికరపు శ్రీనివాస్, సాగరం శ్రీధర్, తమిరి అన్నపూర్ణ, మొగిలి సుజాత, పడిగెల మమత తదితరులున్నారు.

## ప్రజల ప్రాణాలకు ముప్పుగా చైనా మాంజా

- విక్రయంపై పూర్తిస్థాయి నిషేధం
- వినియోగించినా కఠిన చర్యలు
- ప్రజలు సహకరించాలని తెలంగాణ పోలీసుల విజ్ఞప్తి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

ప్రజల భద్రత దృష్ట్యా చైనా మాంజా విక్రయం, వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం అమలులో ఉందని తెలంగాణ పోలీస్ స్పష్టం చేసింది. నిషేధిత చైనా మాంజా వల్ల గతంలో పలు ప్రాణాంతక ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఈ హెచ్చరిక జారీ చేసినట్లు తెలిపింది. చైనా మాంజా అత్యంత పదునుగా ఉండి ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు తీవ్ర ప్రమాదంగా మారుతోందని పోలీసులు పేర్కొన్నారు. గొంతు కోయబడటం, తీవ్ర గాయాలు కావడం వంటి ఘటనలు నమోదవుతున్నాయని తెలిపారు. ఈ కారణంగా చైనా మాంజాను విక్రయించడం, నిల్వ చేయడం, వినియోగించడం పూర్తిగా నిషేధించబడిందని స్పష్టం చేశారు. నిషేధిత చైనా మాంజాను విక్రయించినా, వినియోగించినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణదారులు, హోల్‌సేల్ వ్యాపారులు ఎవరైనా ఈ మాంజాను అమ్మినట్లయితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రజలు కూడా ఎక్కడైనా చైనా మాంజా విక్రయం జరుగుతున్నట్టు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పండుగలు, గాలిపటాల పండుగల సమయంలో సురక్షితమైన సాధారణ మాంజాను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. మీ సరదా ఇతరుల ప్రాణాలకు ముప్పు కాకూడదని హెచ్చరిస్తూ, పిల్లల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలంగాణ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొంటూ, చైనా మాంజాను పూర్తిగా దూరంగా పెట్టాలని తెలంగాణ పోలీసులు మరోసారి పిలుపునిచ్చారు.

## రోడ్డు నియమాలు పాటించాలి

- మద్యం సేవించి వాహనాలు నడపకూడదు
- మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు
- జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మణ్




**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మణ్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని, జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి, కార్ల వాహనదారులు సీటుబెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, రాంగ్‌రూట్‌లో వెళ్లకూడదని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, 18 సంవత్సరాలు నిండిన తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ పొందిన అనంతరమే వాహనాలు ఇవ్వాలని తల్లిదండ్రులకు సూచించారు. అధిక వేగం ప్రాణాలకు ముప్పని గుర్తుంచుకోవాలని అన్నారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ పాఠశాల నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో మానవహారం ఏర్పాటు చేసి రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ సంగీతం శ్రీనాథ్, సర్పంచ్ మామిడి రాజు, మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, ప్రధానోపాధ్యాయిని ప్రేమలత, మోటార్ వాహనాల తనిఖీ అధికారి వంశీధర్, సహాయ తనిఖీ అధికారులు రజిని, పృథ్వీరాజ్ వర్మ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఓటర్ల మ్యాపింగ్ వేగవంతం చేయాలి

- ఎన్నికల సంఘం రాష్ట్ర సీఈవో సుదర్శన్ రెడ్డి
- 15 రోజుల్లో కనీసం 70శాతం పూర్తి చేయాలి
- వీసీలో హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

2025 ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం రాష్ట్ర సీఈవో సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు కేవలం 41 శాతం మ్యాపింగ్ మాత్రమే పూర్తైందని, రాబోయే 15 రోజుల్లో కనీసం 70 శాతం మ్యాపింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బూత్ స్థాయి అధికారుల సహకారంతో ఎస్ఐఆర్-2002ను ఎస్ఎస్ఆర్-2025తో లింకేజీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రతి బీఎల్ఓ రోజుకు కనీసం 30 ఎంట్రీలు పూర్తిచేయాలని టార్గెట్ నిర్దేశించారు. ఎస్ఐఆర్ జాబితా రూపకల్పన ప్రారంభమైన వెంటనే అవసరమైన ఎన్యూమరేటర్ ఫారాలను నియోజకవర్గాల వారీగా ముద్రించి, పోలింగ్ బూత్‌లకు పంపిణీ చేయాలని తెలిపారు. ప్రతి ఇంటికి రెండు ఫారాల చొప్పున బీఎల్ఓల వద్ద అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే రిటర్నింగ్ అధికారులు, ఏఈఆర్ఓలు, డిప్యూటీ తహసిల్దారులు, బీఎల్ఓ సూపర్వైజర్లతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ రోజువారీ లక్ష్యాలతో కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## జీ రాంజీ ఉపాధి పథకాన్ని రద్దు చేయాలి

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**




కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీ రాంజీ ఉపాధి పథకమును రద్దు చేయాలని ఇప్పటికే అమలులో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని జాబ్ కార్డు ఉన్న వారికి 200 కల్పించాలని ఒక రోజు వేతనం 600 రూపాయలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ చట్టాన్ని, రద్దు చేస్తూ, ఈనెల 5వ తేదీన గ్రామ సభలో తీర్మానం చేయాలని అట్లాగే సంక్రాంతి భోగి మంటలో ఈ చట్టప్రతులను దగ్ధం చేయాలని రాష్ట్ర ప్రజలకు వారు పిలుపునిచ్చారు. అఖిలభారత రైతు కూలి సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జనవరి రెండు మూడు తేదీలలో సంఘ అధ్యక్షులు మామిడాల బిక్షపతి అధ్యక్షతన వరంగల్ లో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1966 లో చేసిన విత్తన చట్టం 1983 సంవత్సరంలో రూపొందించబడిన విత్తన నియంత్రణ ఆర్డర్ ను కేంద్ర ప్రభుత్వము తొక్కి పెడుతున్నదని రాజ్యాంగపరంగా వ్యవసాయ రంగంపై రాష్ట్రాలకు ఉండే హక్కులను, హరించి వేస్తున్నదని వారు ఆరోపించారు. బహుళ జాతి విత్తన సంస్థలైన మోన్సాంటో డ్యూ పాయింట్ కార్గిల్ లాంటి సంస్థలకు విత్తనం ఉత్పత్తి నీ కట్టబెట్టడం కోసమే కేంద్ర ప్రభుత్వం బిల్లు తీసుకు వస్తుందని వారన్నారు. ప్రజలకు ఉపయోగపడే అత్యవసర సర్వీసుల లో భాగమైన విద్యుత్, రంగం ను ప్రజల నుండి దూరం చేస్తూ మోడీ ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలకు అనుకూలంగా బిల్లు తీసుకువస్తుందని విమర్శించారు. దీనివల్ల ప్రీపెయిడ్ పద్ధతి ద్వారా విద్యుత్తును రైతులు కొనుగోలు చేయాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల ద్వారా మోడీ ప్రభుత్వం తీసుకువచ్చే ఈ బిల్లును వ్యతిరేకించాలని రైతాంగాన్ని వారు కోరారు. రబి సీజన్లో కూడా రైతులకు యూరియా అందించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని రైతులకు సరిపడా యూరియాను అందించాలని అలాగే రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే ఎరువులను ప్రథమ ప్రాముఖ్యతగా తెలంగాణ రైతుల కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. కృష్ణా గోదావరి నదుల పరివాహక ప్రాంతాల్లో కరువు పేదరికం పునాదిగా నీటి పంపిణీ జరగాలని వారు డిమాండ్ చేశారు. ఈ ప్రెస్ మీట్ లో సంఘం గౌరవ అధ్యక్షులు వి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, నాయకులు బండారి ఐలయ్య, గుజ్జు దేవేందర్, నందగిరి వెంకటేశ్వర్లు, డేవిడ్ కుమార్, తుపాకుల నాగేశ్వరరావు, వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, ఉపాధ్యక్షులు బొమ్మిడ సాంబయ్య, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

ఆదివారం జనవరి 04, 2026

# కొండగట్టుకు తరలిన జనసైనికులు

**- కంటెస్టెడ్ సర్పంచ్ కాసూరి మమతకు ప్రత్యేకంగా పవన్ కల్యాణ్ ఫొటో**

**వేద న్యూస్, హుజూరాబాద్ ప్రతినిధి:**



కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెం నుండి జనసేన పార్టీ నాయకులు కొండగట్టుకు శనివారం తరలివెళ్లారు. తిరుమల తిరుపతి దేవస్థానం రూ.35 కోట్ల నిధులతో నిర్మించ తలపెట్టిన గదులు, హనుమాన్ మాలవిరమణ మండపం కోసం ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్ భూమి పూజ చేయడానికి వచ్చారు. ఆయనను కలిసేందుకు జనసేన పార్టీ నాయకులు జిల్లాల మహేష్, ఇంగే శ్రీనివాస్, కుసుంబ శివాజీ, పుల్ల సాయి కుమార్, కుసుంబ సాంబశివ రావు, కాసూరి కృష్ణ,కాసూరి సుమన్ తదితరులు కొండగట్టుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జనసేన పార్టీ తరఫున మర్రిపల్లిగూడెం గ్రామ సర్పంచిగా పోటీ చేసిన



కంటెస్టెడ్ సర్పంచ్ కాసూరి మమతతో పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ఫొటో దిగారు.కొండగట్టు అంజన్న సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో టీటీడీ నిధులు వచ్చాయని ఈ సందర్భంగా జనసేన లీడర్లు వెల్లడించారు. భక్తులు, ప్రజల పక్షాన జనసేనానికి జనసేన శ్రేణులు ధన్యవాదాలు తెలిపాయి.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మహిళ సంఘాల ఆధ్వర్యంలో భారతదేశ మొట్టమొదటి ఉపాధ్యాయురాలు చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 195వ జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పెద్ద ఎత్తున మహిళలు వివిధ ప్రజాసంఘాల నాయకురాలు బోయిని లావణ్య, పింగిలి చైతన్యలతోపాటు మహిళా సంఘాల నాయకులు, జమ్మికుంట ఎస్సై సతీష్ , ఏఎస్ఐ మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య, భారత నాస్తిక సమాజం అధ్యక్షులు జీడి సారయ్య, ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి అధ్యక్షులు రామంచ భరత్, మారముల ఆనందం కాంగ్రెస్ నాయకులు సజ్జు బొడుగే శ్రీకాంత్ విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు. పూలమాలలతో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. సావిత్రిబాయి ఆశయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి సామాజిక ఉద్యమ వందనాలు తెలిపారు.



- జమ్మికుంట రైల్వే స్టేషన్ ఎదురుగా..

# సిటీ కాలేజీలో ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు




**వేద న్యూస్, హైదరాబాద్:**

చదువు మాత్రమే సామాజిక అసమానతలను తొలగించగలదని నమ్మి, ఆచరించిన ఆదర్శ మహిళ సావిత్రీబాయి పూలే అన్నారు సిటీ కాలేజి వైస్ ప్రిన్సిపాల్ డా.పి.శాంతి. సావిత్రి బాయి పూలే 195వ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ సిటీ కళాశాల ఎన్ఎస్ఎస్, మహిళా సాధికారత విభాగం వారు మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా డా.శాంతి మాట్లాడుతూ వివక్షకు గురైన వారి చెంతకు విద్యను చేర్చడం కోసం సావిత్రీబాయి అనేక అడ్డంకులను ఎదుర్కొన్నారని, అందుకే ఆమె అందరికీ ఆదర్శమని అన్నారు.వైస్ ప్రిన్సిపాల్ డా. విప్లవదత్ శుక్లా మాట్లాడుతూ ఈనాటి మహిళా సాధికారతకు పునాది వేసిన ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి అని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గేయ, వక్తృత్వ పోటీలలో విజేతలకు ధృవ పత్రాలనందజేశారు.డా.శాంతి, డా.శిరీష, డా.మల్లిక, ఎన్ సిసి ఆఫీసరు డా.కృష్ణ వేణి, ఎన్ఎస్ఎస్ అధికారులు డా.బి కృష్ణ చంద్ర కీర్తి, డా.ఎల్.తిరుపతి, డా.సుదక్షణ, డా.శ్రీదేవి, డా.రవీంద్ర బాబు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే

**- ఘనంగా ఆమె 195వ జయంతోత్సవం**

**వేద న్యూస్, జమ్మికుంట:**

సంఘసంస్కర్త, సామాజిక విప్లవకారిని, ఆధునిక భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయుని, రచయిత్రి నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మాత సావిత్రిబాయి పూలే 195 వ జయంతి ఉత్సవాలు శనివారం జమ్మికుంటలో అంబేద్కరిస్ట్, కవి, రచయిత మారేపల్లి బిక్షపతి ఆధ్వర్యంలో బహుజన సామాజిక పరివర్తన వేదికలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హుజరాబాద్ ఏసిపి మాధవి హాజరై మాట్లాడుతూ.. మన తెలంగాణ ప్రాంత ఆడపడుచు సావిత్రిబాయి పూర్వీకుల మూలాలు నిజామాబాద్ జిల్లా బోధన్, నాందేడ్ పరిసర ప్రాంతాల్లో ఉన్నాయని చెప్పారు. ఆమెకు 9వ ఏ టనే 12 సంవత్సరాల మహాత్మ జ్యోతిరావు పూలే తో 1840 లో వివాహం జరిగిందని, నిరక్షరాస్యురాలిగా ఉన్న ఆమెకు భర్త నే మొదటి గురువు అని పేర్కొన్నారు. ఆయన ప్రోత్సాహంతోనే అక్షరాభ్యాసం చేసి చదువు నేర్చుకొని విద్యావంతురాలైందన్నారు. అలాగే భారతదేశం మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలి తరం మహిళ ఉద్యమకారురాలు అని వెల్లడించారు. పుణెలో 54 పాఠశాలలను ప్రారంభించి మహిళా విద్యకు మహోన్నతమైన కృషి చేసిందని పేర్కొన్నారు. విద్య అందరి ని ఉన్నతంగా తీర్చిది ద్దుతుంద ని అందుకే విద్య ఎంతో అవసరం అని అన్నారు. నేడు స్త్రీలు ఉన్నతమైన స్థానాల్లో అంతరిక్ష పరిశోధనలో ఉన్నారంటే దానికి స్ఫూర్తి సావిత్రిబాయి పూలే అని చెప్పారు. అనంతరం మహిళా ఉద్యోగులందర్నీ ఏసీపీ శాలువాలతో ఘనంగా సత్కరించారు, కార్యక్రమంలో జమ్మికుంట పోలీస్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, మాజీ మార్కెట్ చైర్మన్, సహకార సంఘాల జిల్లా ఉపాధ్యక్షులు పింగిళి రమ రమేష్, పబ్బు భార్గవి, పూదరి రేణుక శివకుమార్, డాక్టర్ వర్ణ, గుంటి సామ్రాజ్యం, మెప్మా అధికారిని మల్లేశ్వరి, బుడిగ శ్రీకాంత్, సాయిని రవి ల తో పాటు ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, మున్సిపల్ ఉద్యోగినిలు లతోపాటు సామాజిక కార్యకర్తలు, ఉద్యమకారులు పాల్గొన్నారు.




# చదువుల తల్లి సావిత్రిబాయి

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మండలం తనుగుల గ్రామ పంచాయతీ ఆవరణలో సావిత్రిబాయి పూలే 195వ జయంతి ఉత్సవాలు గ్రామ సర్పంచ్ జక్కే కిరణ్ గౌడ్ అధ్యక్షతన పాలక వర్గం ఘనంగా నిర్వహించింది. రాష్టంలో మహిళలకు సమాన హక్కులు సమ న్యాయం జరిగిన రోజు సావిత్రి బాయి పూలే కి ఘనమైన నివాళి అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ అంబాల స్వప్న రజనీకాంత్, గ్రామ కార్యదర్శి శ్రీకాంత్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.






# సదర్మాట్ బ్యారేజ్ వద్ద రైతుల ధర్నా

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం :**



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాలకు చెందిన ఎనిమిది గ్రామాల రైతులు సదర్మాట్ బ్యారేజ్ వద్ద ధర్నాకు దిగారు. సుమారు 6 వేల ఎకరాలకు పైగా పంట భూములు నీరు లేక ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కోరుట్ల నియోజకవర్గంలోని వేములకుర్తి, యామపూర్, పకీర్ కొండాపూర్, సంగెం శ్రీరాంపూర్, మొగిలిపేట, ఓబులాపూర్, దామరాజుపల్లి, వాల్గొండ గ్రామాలకు చెందిన రైతుల భూములకు సదర్మాట్ బ్యారేజ్ నుంచి గంగనాల ప్రాజెక్టు వరకు రెండు పంటలకు సరిపడా నీరు వదలాలని డిమాండ్ చేశారు. గతంలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక గేటు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే నీటి నిల్వ కోసం ఆయకట్టులు ఏర్పాటు చేయాలని కోరుతూ ఇప్పటికే అధికారులకు వినతిపత్రం అందజేశామని రైతులు తెలిపారు. తమ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని వారు కోరారు.

# గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

**- ఆమనగల్లు సర్పంచ్ పిల్లల సందీప్**

**వేద న్యూస్, నల్లగొండ ప్రతినిధి:**



ఆమనగల్లు గ్రామాన్ని దేశంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని సర్పంచ్ పిల్లల సందీప్ తెలిపారు. శనివారం గ్రామంలో పలు కాలనీల్లో రహదారులపై అడ్డుగా పెరిగిన చెట్లను జేసీబీతో తొలగిస్తూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ గ్రామ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ షాలెం రాజు, వార్డు సభ్యుడు పెరుమాండ్ల నగేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సయ్యద్ జాన్, పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు

# సమస్యలు పరిష్కరిస్తా..నేరుగా చెప్పండి

**- మహాత్మా జ్యోతిబా పూలే హాస్టల్ ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మార్వో ఇక్బాల్**

**- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మార్వో**

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



ఖిలావరంగల్ మండలం మామునూర్ మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ హాస్టల్ ని మండల ఎమ్మార్వో మహమ్మద్ ఇక్బాల్ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. అక్కడ విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. భోజనం విషయంలో ఎలాంటి ఫిర్యాదులు ఉన్న తనకి నేరుగా తెలియజేయాలని విద్యార్థులకు తెలిపారు.హాస్టల్ వార్డెన్ తో మాట్లాడి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని తెలిపారు.వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు ఎమ్మార్వో ఈ సందర్భంగా తెలిపారు.

# ఆరెకుల సర్పంచులకు ఘన సన్మానం

**- ఆరె సంక్షేమ సంఘం జిల్లా క్యాలెండర్ ఆవిష్కరణ**

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**



బాలసముద్రంలోని ఆరె సంఘ భవనంలో శనివారం ఆరె సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి రూపొందించిన క్యాలెండర్ ఆవిష్కరణ, ఆరె కుల సర్పంచుల సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లూరి కండేరావు అధ్యక్షతన జరిగింది. ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకు లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎంతో శ్రమకోర్చి హనుమకొండ జిల్లా కమిటీ 2026 క్యాలెండర్‌ను రూపొందించడం అభినందనీయమని అన్నారు. క్యాలెండర్ అనేది ఆరె కుల ఐక్యతకు దండలో దారం లాంటిదని వ్యాఖ్యానించారు. 14 మంది ఆరె కుల సర్పంచులు ఎన్నికవడం గర్వకారణమని, ఈ విజయం గ్రామ స్థాయితో ఆగకుండా చట్టసభల వరకు కొనసాగాలని ఆకాంక్షించారు.సాధారణ ప్రజల గుండెల్లో ధైర్యం నింపిన మహానేత, గ్రామ పాలనకు ప్రాధాన్యం ఇచ్చిన ఛత్రపతి శివాజీ మహారాజు స్ఫూర్తితో ఆరె కుల సర్పంచులు గ్రామాల్లో ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెట్టుపెల్లి శివాజీ మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లా కమిటీ సంఘ కార్యక్రమాల్లో అన్ని జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు. ఆరె కుల సర్పంచులకు భవానీ మాత ఆశీర్వాదం ఉండాలని ఆకాంక్షించారు.ఆరె కులం విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక అభివృద్ధి రంగాల్లో మరింత ముందుకు సాగాలంటే శివాజీ మహారాజ్ చూపిన ధైర్యం, క్రమశిక్షణ, ఐక్యతను అనుసరించాలని వక్తలు సూచించారు. గ్రామాభివృద్ధిలో సర్పంచులు ముందుండాలని, గ్రామాల్లో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాల ఏర్పాటు చేయాలని కోరారు.కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జెండా రాజేష్, మోర్తాల చందర్ రావు,బలేరావు మనోహర్ రావు, కుడ్ల మనోహర రావు, లాండిగే లక్ష్మణరావు, వలిగే సాంబరావు, హింగే శివాజీ, దుమాల సుధాకర్, సుకినె సంతాజీ, జిల్లా గౌరవ అధ్యక్షులు వాడికారి బాబురావు,ప్రధాన కార్యదర్శి వజ్ర కిషన్ రావు జిల్లా నాయకులు పేర్వాల లింగమూర్తి, లోనె దీపక్ జి, నాగుర్ల సంతోష్, కిషన్ రావు, సుధాకర్ రావు హింగే భాస్కర్,శ్రీనివాస్ వివిధ మండలాల అధ్యక్షులు, కులబంధువులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073